క్లుప్తంగా

తెరవే సాహితీ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 78వ నెలవారీ సాహితీ సమ్మేళనం పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. సంస్థ కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో పలువురు కవులు తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కె.సంతోష్‌కుమార్, బి.మోహన్‌గాంధీ, తోట గోపాలరావు, ఐ.పాపయ్య, డాక్టర్ కోమలరావు, పి.వి.దుర్గాప్రసాద్, భోగెల ఉమామహేశ్వరరావు, చిరంజీవి, ప్రసాద్, శంకరరావు, ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథాలయంలో శుద్ధజలం యూనిట్



యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథాలయానికి వచ్చే భక్తుల కోసం ఉచిత శుద్ధజలం యూనిట్‌ను కళింగ కోమటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎంపీపీ గొండు రఘురామ్ ఆదివారం ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఈఓ జి.గురునాథం, పాలకమండలి సభ్యుడు డబ్బీరు వాసుదేవరావు, కళింగ కోమటి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు లాడె కిషోర్‌కుమార్, సర్పంచ్ అనిత, ఎంపీటీసీ ఊట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిత్రునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

గార: కొత్తపేట గ్రామానికి చెందిన జోగి కృష్ణకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చేయి విరిగింది. పేద కుటుంబం కావడంతో పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ. 25 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మార్పు దుర్గాప్రసాద్, బడగల దుర్గాప్రసాద్, సూర్యనారాయణ, షణ్ముఖరావు, రాజారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

జి.సిగడాం: అందరూ చదువుకుంటనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని శ్రీ సరస్వతి గ్రంథాలయం చైర్మన్ మక్క పెద్ద అప్పలనాయుడు, పెంట గ్రామ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గార విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం పెంట గ్రామంలో గ్రంథాలయం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ మక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి.. పింఛన్ అందించి..



ఎర్రయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సతీష్

రణస్థలం: మండలంలోని కొండములగాం గ్రామానికి చెందిన పతివాడ ఎర్రయ్య అనారోగ్యంతో విశాఖపట్నం ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ సతీష్ ఆదివారం అక్కడికి వెళ్లి పెన్షన్ డబ్బులు అందజేశారు.

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కింతలిమిల్లు జంక్షన్ వద్ద కనక మహాలక్ష్మీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

9 మంది జూదరుల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలోని గుజరాతీపేటలో పేకాట ఆడుతూ తొమ్మిది మంది జూదరులు పట్టుబడినట్లు రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మీ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.25 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పంచదార చిలక.. సంప్రదాయానికి ప్రతీక

- పెళ్లిళ్లు, పుట్టిన రోజులు, సీమంతాల సమయంలో గిరాకీ
- ప్రారంభమైన సీజన్
- జిల్లా కేంద్రంలోనే ఎక్కువగా విక్రయాలు



మార్కెట్‌లో పంచదార చిలకలను అమ్ముతున్న దృశ్యం



పంచదార చిలక

శ్రీకాకుళం కల్చరల్: పంచదార చిలకల సీజన్ మొదలైంది. ఏడాదిలో కేవలం ఆరునెలలు గిరాకీ ఉండే వీటిని శ్రీకాకుళం పట్టణంలోని కొన్ని కుటుంబాల వారే తయారు చేస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలో మాత్రం వీటిని ఎక్కువగా వినియోగిస్తుంటారు. పెద్ద మార్కెట్ నుంచి ఏడు రోడ్ల కూడలికి వెళ్లే దారిలో పందుమ్ పుల్లల జంక్షన్ వద్ద వీటిని విక్రయిస్తుంటారు. పంచదారతో తయారు చేసిన వీటికి పెళ్లిళ్ల సీజన్‌లో గిరాకీ ఉంటుంది. వివాహమై అత్తవారింటికి వెళ్లే ఆడపిల్లకు సారెతోపాటు సంప్రదాయంగా చిలకలు, పొంగులు పంపిస్తారు. మరికొన్ని కుటుంబాల్లో చిన్నపిల్లల బారసాల సమయంలో పంచదార చిలకలు పంచుతారు.

రంగుల్లో చిలక..

పంచదార చిలకలను గులాబీ, తెలుపు రంగుల్లో ఎక్కువగా తయారు చేస్తారు. వినియోగదారుని అభిరుచి మేరకు వివిధ సైజుల్లో సిద్ధం చేస్తారు. వీటితోపాటు పొంగులు కూడా తయారు చేస్తారు. ముందుగా సిద్ధం చేసుకున్న అచ్చుల్లో పంచదార పాకం వేసి చిలకలు తయారు చేస్తారు. ఆ సమయంలోనే రంగు కలుపుతారు. పట్టణంలో కేవలం ఐదు కుటుంబాలు మాత్రమే వీటిని తయారు చేస్తున్నాయి. ఈ సీజన్‌లోనే పని ఎక్కువగా ఉంటుంది. కేజీ పంచదారకు సాధారణ సైజులో 15 వరకు చిలకలు సిద్ధమవుతాయి. పెద్దసైజువి నాలుగు తయారవుతాయి. కేజీ పంచదార రూ.40 వరకు ఉండటంతో కేజీ రూ.150కు అమ్ముతున్నారు. సీజన్‌లో రోజుకు రూ.1000 నుంచి రూ.1500 వరకు ఆదాయం వస్తుంది. విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగే యాత్రల్లోనూ వీటికి గిరాకీ ఎక్కువ.

ఆరునెలలే సీజన్..



పెళ్లిళ్ల సీజన్‌లో పంచాదార చిలకలకు గిరాకీ ఉంటుంది. ఆరు నెలలు మాత్రమే వీటిని తయారు చేసి మార్కెట్లో అమ్మకానికి పెడతాం. మిగిలిన సమయాల్లో కూలి పనులకు వెళుతుంటాం. ఇంటి వద్ద ఆర్డర్ ఇస్తే తయారుచేసి అందిస్తాం.

– ఎస్.గణపతి, తయారుదారుడు

ధ్యాన సాధనతో శాంతిస్థాపన



శిక్షణ వివరాలు వెల్లడిస్తున్న అమ్మన్నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఇంటా శాంతియుత వాతావరణం ఉండాలంటే ధ్యాన సాధనతోనే సాధ్యమవుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఏటీఎల్ జిల్లా ప్రతినిధి కింజరాపు అమ్మన్నాయుడు అన్నారు. ఆదివారం పెద్దపాడు రోడ్డులోని జిల్లా ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అశాంతి, అలజడి పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల నుంచి సమాజాన్ని రక్షించడానికి ధ్యానం ఒక్కటే మార్గమని చెప్పారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉపాధ్యాయుల సహకారంతో దేశవ్యాప్తంగా 'ప్రతి ఇంట్లో ధ్యానం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిత్యా విద్యానిలయం, నలందా స్కూల్లో ఆర్ట్ ఆఫ్‌లివింగ్ ఉపాధ్యాయులు డి.సురేంద్ర, వి.సందీప్ కుమార్‌లు విద్యార్థులకు ధ్యానంపై ఉచిత శిక్షణ ఇచ్చారని చెప్పారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు 7989752675, 8096553331 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీటీసీ సభ్యులు శిల్లా రమేష్, ఏటీఎల్ టీచర్లు వారణాసి సందీప్‌కుమార్, పి.శ్రీనివాసరెడ్డి, దేసూళ సురేంద్ర, స్కూల్ టీచర్లు డి.రమేష్, బాబు, సీహెచ్.రాము, నక్క రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత



ప్రసంగిస్తున్న మూర్తి

జి.సిగడాం: విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత కలిగి ఉండాలని జిల్లా సత్యసాయి సంస్థల వేద పఠన ఇన్‌చార్జి మూర్తి అన్నారు. ఆదివారం జి.సిగడాం బీసీ వసతి గృహంలో వార్డెన్ లోలుగు నూకరాజు ఆధ్వర్యంలో బాల వికాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ, భక్తి భావం కలిగి ఉండాలన్నారు. ఉదయం, సాయంత్రం ఆధ్యాత్మిక బోధనలు వినాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి ఆనంద నిలయం కన్వీనర్ లోకేష్, బాల వికాస్ గురువులు దున్నా స్వాతి, నీలిమ, సీహెచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఆసరాగా సంచార పశు ఆరోగ్యసేవలు



వాహన సేవలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గాయత్రి

లావేరు: పాడిరైతుల కోసమే ప్రభుత్వం వైఎస్సార్ పశు సంచార ఆరోగ్య వాహన సేవలు ప్రారంభించిందని పెదలింగాలవలస పంచాయతీ సర్పంచ్ లుకలాపు యశోద, వైఎస్సార్ సీపీ భూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు అన్నారు. పెదలింగాలవలసలో ఆదివారం వైఎస్సార్ పశు సంచార ఆరోగ్య వాహనం ద్వారా పశువులకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యురాలు డాక్టర్ జి.గాయత్రి, వెటర్నరీ అసిస్టెంట్ మీసాల గణేష్, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, పీఎంసీ చైర్మన్ బొబ్బాది సూర్యారావు, నాయకులు నెల్లి బలరాం, పట్నాల పారయ్య, గొర్లె రామక్రిష్ణ, పతివాడ గురునాయుడు, దన్నాన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



లావేరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

లావేరు: పుస్తక పఠనంతో విజ్ఞానం కలుగుతుందని లావేరు శాఖా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఉపయోగపడే అన్ని రకాల పుస్తకాలతో పాటు రామాయణం, మహాభారతం, బైబిల్, ఖురాన్ తదితర 100 రకాల పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఒక్క అవకాశం ఇవ్వండి



పట్టభద్రులతో మాట్లాడుతున్న దుప్పల రవీంద్రబాబు

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో తనను గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి దుప్పల రవీంద్రబాబు కోరా రు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని సానా వీధి, డీసీసీబీ బ్యాంక్ కాలనీలో పట్టభద్రులను కలిశారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి బలపర్చాలని కోరారు. అనంతరం మేనిఫెస్టో, బ్యాలెట్ నమూనా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రమేష్, పంచాది సత్యం మాస్టరు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాలమ్మ తల్లి ఉత్సవాలు



పూజలందుకుంటున్న నేతాలమ్మ తల్లి

జి.సిగడాం: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి నేతాలమ్మ తల్లి 25వ యాత్రా మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 7 వరకు కొనసాగే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానం



చక్రతీర్థ స్నానాలకు విగ్రహాలను తీసుకువెళ్తున్న గ్రామస్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మొదుగువలసలో గల భువనేశ్వరిదేవి, లక్ష్మీగణపతి సహిత శ్రీరామలింగేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం 29వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామి వారి చక్రతీర్థ స్నానాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా భక్తుల కోసం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార నదిలో వేసిన పందిరిలో ప్రత్యేక పూజలు నిర్వహించి చక్రతీర్థ స్నానాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

సుధాకర్‌ను గెలిపిద్దాం



బుడుమూరులో ప్రచారం నిర్వహిస్తున్న రమేష్ బాబు, నాయకులు



రణస్థలం: కొవ్వాడలో ప్రచారం నిర్వహిస్తున్న సాయికుమార్, నాయకులు

లావేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీ అర్బన్ ఫైనాన్సు రాష్ట్ర డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు కోరారు. బుడుమూరులో ఆదివారం సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. గతంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారు పట్టభద్రుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. సుధాకర్‌కు ఒక్క అవకాశం ఇస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెదనాయిని చిట్టిబాబు, బొడ్డ రవిబాబు, ఎన్.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

రణస్థలం: వైఎస్సార్ సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పిలుపునిచ్చారు. రణస్థలం మండలం కొవ్వాడ పంచాయతీలో ఆదివారం ఎన్నికల ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సుధాకర్‌కు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్ సీపీ నాయకులు మైలపల్లి కామరాజు, మహంతి పెదరామినాయుడు, అల్లిపల్లి రాముడు, మైలపల్లి నాగబాబు, అల్లిపల్లి అప్పన్న, మల్లిబాబు, దుమ్ము శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్స్ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఏడు రోడ్ల కూడలి వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ప్రారంభించారు. 180 మందికి బ్లడ్ గ్రూప్, షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ హెరిన్‌కుమార్, డాక్టర్ ఆర్.సూర్యకుమారి, డాక్టర్ ఐ.దినేష్, డాక్టర్ ప్రేమ్ సక్కరి తదితరులు రోగులకు వైద్యపరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు జగన్నాథంనాయుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధి హరికాప్రసాద్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ జోగినాయుడు, గేదెల ఇందిరాప్రసాద్, సీనియర్ సిటిజెన్స్ అండ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమసుందరరావు, పి.ఎస్.ప్రసాదరావు, బి.జయలక్ష్మీ, యు.నవజీవనరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు, సత్కారాలు అందుకున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు చేయూత సేవా సంఘం నిర్వహించిన సైన్స్ పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని శ్రీకాకుళం నగర పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో ఎస్.జశ్వంత్ (6వ తరగతి), కె.తేజ శ్రీ (7వ తరగతి), సీహెచ్ కార్తీక్ (8వ తరగతి) ప్రథమ స్థానాల్లో నిలిచారు. ఎస్.వైష్ణవి (7వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచింది. వీరిని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల డైరెక్టర్ అన్నెపు లావణ్యరాణి, ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పట్టభద్రుల ఓటర్ స్లిప్పుల పంపిణీ



జె.ఆర్.పురంలో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్న వీఆర్వో

రణస్థలం: మండలంలో 1662 మంది పట్టభద్రుల ఓటర్ స్లిప్పులను పోలింగ్ బూత్ అధికారుల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జె.ఆర్.పురం పంచాయతీలో పోలింగ్ బూత్ అధికారి, వీఆర్వో లుకలాపు అప్పలనాయుడు పట్టభద్రులకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం ప్రతి పట్టభద్ర ఓటరుకు నేరుగా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలని సూచించారు.

చిన్నారులకు ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. యోగా, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బి.ఎం.ఎస్.పట్నాయక్, నిక్కు హరిసత్యనారాయణ, నటుకుల మోహన్, జగన్నాథంనాయుడు, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

ప్రయాణికుడి నిజాయితీ



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్స్

శ్రీకాకుళం అర్బన్: వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలోని కొత్తవీధికి చెందిన జోలింగి ఈశ్వరరావు ఆదివారం శ్రీకాకుళం బస్టాండులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ ఫోన్ మెళియాపుట్టి మండలం కేరాసింగి గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావుకు దొరకడంతో వెంటనే బస్టాండ్ స్టేషన్ మేనేజర్ వి.శామ్యూల్‌కు అప్పగించారు. ఈలోగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి తగిన ఆధారాలతో కాంప్లెక్స్‌కు రావడంతో అధికారులు సెల్‌ఫోన్ తిరిగి అప్పగించారు. ఆర్టీసీ బస్టాండ్ కానిస్టేబుల్స్ ఎం.గోవిందరావు, పి.రామకృష్ణల చేతులమీదుగా సెల్‌ఫోన్‌ను అందజేశారు. ప్రయాణికుడు శ్రీనివాసరావు నిజాయితీని అధికారులు అభినందించారు.

విత్తన గుళికలతో ప్రయోజనం

కొత్తూరు: విత్తన గుళికలు తయారు చేసుకోవడం వల్ల రైతులు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని మహసింగిగూడలో గిరిజన రైతులకు విత్తన గుళికలు తయారీపై అవగాహన కల్పించారు. శతశాతం మెలకవస్తుందని, చీడపీడలు పట్టవన్నారు. వర్షం నెల రోజులు లేకపోయిన ఎటువంటి నష్టం జరగదన్నారు. ప్రతీ రైతు పప్పు ధాన్యాలకు మాత్రమే విత్తన గుళికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

భార్య కళ్లెదుటే..

- రైలు ఢీకొని భర్త దుర్మరణం
- కావలి రైల్వేస్టేషన్‌లో ఘటన

కావలి: సొంతూరికి వెళ్లడానికి భార్యాభర్తలు కావలి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. రైలు రావడం ఆలస్యమవుతుందని, ఆకలికి బిస్కెట్లు తిందామని దంపతులు అనుకున్నారు. భర్త బిస్కెట్లు కొనుగోలు చేసి భార్య వద్దకు వస్తుండగా.. రైలు ఢీకొని మృతిచెందాడు. కావలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఈ విషాదకర ఘటన జరిగింది. కావలి రైల్వే ఎస్సై టి.అరుణకుమారి కథనం మేరకు.. శ్రీకాకుళంకు చెందిన హరిబాబు (50), ఆయన భార్య కావలి మండలం సిరిపురం గ్రామం వద్ద ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారు. దంపతులు తమ ఊరికి వెళ్లడానికి ఆదివారం మధ్యాహ్నం కావలి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మూడో నంబర్ ప్లాట్‌ఫారం మీద బెంచీలపై కూర్చొన్నారు. రైలు రావడం ఆలస్యమవుతుందని వారికి తెలిసింది. ఆకలి వేయడంతో బిస్కెట్లు తిందామని దంపతులు అనుకున్నారు. దీంతో హరిబాబు రెండో నంబర్ ప్లాట్‌ఫారం మీద ఉన్న స్టాల్స్ వద్దకు వెళ్లాడు. బిస్కెట్లు కొనుగోలు చేసి పట్టాలు దాటుకుని మూడో నంబర్ ప్లాట్‌ఫారం ఎక్కుతున్న హరిబాబును రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య కళ్లెదుటే ఈ విషాదం జరిగింది. భర్త మృతి చెందడంతో ఆమె కన్నీరుమున్నీరుగా రోదించింది. కావలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.